## క్లుప్తంగా

### వెంకన్నకు క్షీరాభిషేకం



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం క్షీరాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

### 26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సబ్బవరం:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బి. శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 27 ఏళ్ల లోపు ఉండి ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ 2020–21,2021–22, 2022 –23 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువకులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ హెటిరో డ్రగ్స్ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నాయన్నారు. ఆసక్తి కలిగిన యువకులు బయోడేటా, సర్టిఫికెట్స్ తో 26న కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

### త్వరలో అందుబాటులోకి ఆధునిక డంపింగ్‌యార్డు



సీసీఎస్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: చీమలాపల్లి వద్ద జీవీఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఆధునిక డంపింగ్ యార్డు త్వరలో అందుబాటులోకి వస్తుందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు వెల్లడించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న యార్డును దేముడు పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సైట్ మేనేజర్ సందీప్, ఇన్‌చార్జి లాజర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### భిక్షగాడి ఆత్మహత్య



మృతుడు ఆనంద్

సింహాచలం: ఉరిపోసుకుని భిక్షగాడు మృతి చెందిన సంఘటన సింహాచలంలోని కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద శుక్రవారం వెలుగుచూసింది. సుమారు 60 ఏళ్ల కలిగిన వ్యక్తి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల సమీపంలోని చెట్టుకు ఉరివేసుకున్న ఉండటాన్ని పలువురు చూశారు. గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలు సేకరించారు. మృతుడి పేరు ఆనంద్, గవర జగ్గరాజుపేట గ్రామం అని ప్రాథమికంగా గుర్తించారు. కానీ మృతుడి రక్త సంబంధీకుల వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. ఆచూకీ తెలిసినవాళ్లు 9440796020, 6303844772, 8331041648 నంబర్లలో సంప్రదించాలని గోపాలపట్నం పోలీసులు కోరారు.

### దేవిపురంలో నేడు లలిత జయంతి

సబ్బవరం: మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని శ్రీయంత్ర మహామేరులో మాఘ పౌర్ణమి పురస్కరించుకొని శనివారం లలిత జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు గురు మాత అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వేకువజామున గోమాత పూజతో లలిత జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమై ఖడ్గమాల దేవతలకు వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.



# ముత్యాలమ్మపాలేనికి మాఘపౌర్ణమి శోభ

- తీరప్రాంతానికి వేలాది తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు
- బందోబస్తును పరిశీలించిన డీఎస్పీ సత్యనారాయణ



తీర ప్రాంతంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ



పల్సర్‌బైక్ ఝాన్సీ బృందం సందడి



మాధవస్వామి

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరానికి మాఘ పౌర్ణమి శోభ వచ్చింది. శుక్రవారం రాత్రికి భక్తులు వేలాదిగా చేరుకున్నారు. రాత్రి జాగరణ చేసి శనివారం వేకువ జాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించనున్నారు. వేలాదిగా వచ్చే భక్తుల కోసం ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్నానాలు అనంతరం తీరంలో కొలువుదీరిన శ్రీ మాధవస్వామి భక్తులు దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎండ నేపథ్యంలో మాధవస్వామిని దర్శించుకొనే భక్తుల కోసం ఆలయం వద్ద ప్రత్యేక షామియాలు ఏర్పాటు చేశారు. తీరానికి వెళ్లే రహదారికి ఇరువైపులా రంగు రంగుల విద్యుత్ తోరణాలతో సుందరంగా అలంకరించారు. తీరంలో శుక్రవారం రాత్రి జాగరణ ఆచరించే భక్తుల కోసం తీరంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**గజఈతగాళ్ల ఏర్పాటు**

తీరంలో పుణ్య స్నానాలు ఆచరించే స్నానాల ఘట్టాల వద్ద ప్రమాదాల నివారణ కోసం 20 మంది గజ ఈతగాళ్లను నియమించారు. సముద్రంలో లోతు ప్రదేశాలకు వెళ్లకుండా తీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భక్తులకు హెచ్చరికలు జారీ చేయడానికి వీలుగా తీరం వద్ద ప్రత్యేక పోలీసులను నియమించారు. తీరం వద్దకు వాహనాలను నిషేధించారు. భక్తుల సౌకర్యార్థం స్టీల్ సిటీ డిపో యాజమాన్యం ముత్యాలమ్మపాలెం వరకు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 10 ఆర్టీసీ బస్సులు నడుపుతుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా 70 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఎస్. బాలసూర్యారావు చెప్పారు.

**అప్రమత్తంగా ఉండండి**

ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ స్థానిక పోలీసులను ఆదేశించారు. మాఘ పౌర్ణమి జాతరను పురస్కరించుకొని తీర ప్రాంతంలో నిర్వహించనున్న పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులు సముద్రం లోపలికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు మైక్‌లో అప్రమత్తం చేయాలన్నారు. ముత్యమాంబ ఆలయం సమీపంలో వాహనాలు నిలిపివేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ఎస్.బాలసూర్యారావును ఆదేశించారు. ఎస్ఐ మల్లేశ్వరరావు, ఇన్‌చార్జి వీఆర్వో కమల, సచివాలయ సిబ్బంది ఉన్నారు.




ముస్తాబైన మాధవస్వామి ఆలయం



ముత్యాలమ్మపాలెంలో హోరా హోరీగా సాగుతున్న వాలీబాల్ మ్యాచ్

## ఘనంగా బంగారమ్మతల్లి పరస



పూజలందుకున్న బంగారమ్మతల్లి



పరసలో భక్తుల సందడి

పెందుర్తి: మండలంలోని గొరపల్లి పంచాయతీ గంగమ్మపేటలో వెలసిన మూడుగ్రామాల గ్రామ దేవత బంగారమ్మతల్లి పరస రెండోరోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి బంగారమ్మతల్లికి అభిషేకాలు చేసి పూజలు జరిపారు. భక్తులు పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించారు. భజన చెట్లను ఊరేగించి పూజలు చేశారు. చిన్నారులు రంగురాట్నాలు ఎక్కి సంబరపడ్డారు. వాలీబాల్ పోటీల్లో యువకులు ఉత్సాహంగా తలపడ్డారు. పరసకు గొరపల్లి, గంగమ్మపేట, కోట్నివానిపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, గొల్లలపాలెం తదితర గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

## శంకర్ ఫౌండేషన్ వైద్యుడు శ్రీకాంత్‌కు గోల్డ్‌మెడల్



డాక్టర్ శ్రీకాంత్

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌కు ఆర్‌పి బాలచంద్ర గోల్డ్ మెడల్ లభించింది. నాసిక్‌లో శుక్రవారం జరిగిన మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్నాతకోత్సవ వేడుకల్లో ఎంఎస్(నేత్ర వైద్యం)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తొలిస్థానంలో నిలిచిన డాక్టర్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిటైర్డ్ వైస్ చాన్సలర్ లెఫ్టినెంట్ జనరల్ మాధురీ కనిట్కర్ శ్రీధర్‌కు పురస్కారం అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్ విజయనగరంలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి ఎంబీబీఎస్ పట్టభద్రుడయ్యారు. 2019–22లో పూణేలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కళాశాలలో పోస్టు గాడ్యుయేషన్ చేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ శ్రీకాంత్‌ని శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు,వైద్యులు, సిబ్బంది అభినందించారు.

## ఆత్మీయ సత్కారం



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును సత్కరిస్తున్న సురేష్ రాజ్ తదితరులు

సబ్బవరం: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారి విశాఖ వచ్చిన గొల్ల బాబూరావును సీతమ్మధారలోని తన స్వగృహంలో అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. దళిత సామజిక వర్గానికి చెందిన సామాన్య వ్యక్తి గొల్ల బాబూరావును రాజ్యసభకు పంపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సబ్బవరం మండల వైఎస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, అనకాపల్లి జిల్లా యువజన విభాగం కార్యదర్శి సేనాపతి దుర్గ అప్పారావు ,రాజ్ కుమార్ , పవన్ , ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భాగవత కాలక్షేపం

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన భాగవతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. రేడియో గాయకుడు భాగవతార్ జేజే నారాయణ ఆలపించిన మార్కండేయ చరిత్ర, ధానవీరసూరకర్ణ భాగవతం ప్రేక్షకులను మెప్పించింది. రామచంద్రమ్మ ఆలయ పూజారి కూండ్రపు అప్పలనాయుడు శుక్రవారం భాగవతార్ జేజే నారాయణకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని ప్రేక్షకులు ఈ సదావాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూజారి అప్పలనాయుడు కోరారు.



నారాయణను సత్కరిస్తున్న పూజారి అప్పలనాయుడు

## కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం , కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

## కేజీహెచ్‌లో పీఐసీయూ సిద్ధం

- 27న ప్రారంభోత్సవం చేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు



యూనిట్‌లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు



పిల్లల వార్డులో కొత్తగా నిర్మిస్తున్న పీఐసీయూ యూనిట్

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) ఈనెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ. 20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.


## సింహాచలం డిపో అసిస్టెంట్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా జి.రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జై భీమ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, సింహాచలం డిపో అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సింహాచలం డిపోలో ట్రాఫిక్ సెక్షన్‌లో ఎస్‌టీఐగా పని చేసిన రమణమూర్తి కూర్మన్నపాలెం డిపోకు అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతిపై వెళ్లి, అక్కడి నుంచి మళ్లీ సింహాచలం డిపోకే అసిస్టెంట్ మేనేజర్‌గా రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, డిపో ఏడీసీ కె.ఎ.రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. గురయ్య, జాయింట్ సెక్రటరీ జి.సోములు, డిపో అధ్యక్షుడు ప్రసాద్, సెక్రటరీ కె.గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి. ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎ.అప్పారావు పాల్గొన్నారు.



రమణమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాంబాబు తదితరులు

## లలితాదేవి నగరోత్సవం నేడు



విశేష అలంకరణలో లలితాదేవి

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పసుపు, కుంకుమలతో విశేష అలంకారం చేశారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి లలితాదేవికి, యాగశాలలో మండపారాధనకు, కాళీకాలభైరవులకు స్వయంగా హారతులిచ్చారు. అమృతోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటలకు లలితా అమ్మవారికి విశేష నగరోత్సవం నిర్వహించనున్నారు. ప్రత్యేక రథంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఉదయం కాళీ కాలభైరవులకు విశేష పూజలు, శాంతి హోమాలు, మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి జరుగుతాయని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఉన్నత పాఠశాలను సందర్శించిన స్టేట్ ఎల్ఐపీ బృందం



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎల్ఐపీ బృందం సభ్యులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎల్ఐపీ(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం) రాష్ట్ర బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా 6,7,8వ తరగతుల విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, సైన్స్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎల్ఐపీ బృందం సభ్యులు భారతి, త్రినాథరావు, డైట్ అధ్యాపకులు రామనాథం, ఎంఈవో లక్ష్మణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెం వద్ద విద్యుత్ తీగలు తగిలి ఓ గడ్డి ట్రాక్టర్ శుక్రవారం అగ్నికి ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి... సబ్బవరం నుంచి లంకెలపాలెం వైపు వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్ గండివానిపాలెం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బస్సుకు సైడు ఇస్తున్న క్రమంలో డ్రైవర్ ట్రాక్టరును రోడ్డు పక్కకు తీశాడు. రోడ్డు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు గడ్డి ట్రాక్టర్‌కు అంటుకొని మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపించిన విషయాన్ని గ్రహించిన డ్రైవర్ వెంటనే మంటలు వ్యాపించిన తొట్టె నుంచి ఇంజిను వేరు చేశాడు. వరి గడ్డి కావడంతో మంటలు విపరీతంగా ఎగసిపడ్డాయి. ప్రమాద సమాచారం అందుకున్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గడ్డితో ఉన్న తొట్టె చాలా వరకు కాలిపోయిందని స్థానికులు తెలిపారు.



విద్యుత్ తీగలు అంటుకొని దగ్ధమవుతున్న గడ్డి ట్రాక్టర్

## ఏవీఎన్ కళాశాలకు బీఎన్ రెడ్డి విరాళం

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్‌రెడ్డి తాను చదివిన ఏవీఎన్ కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం .సింహాద్రినాయుడుకు ఈ మొత్తం చెక్‌ను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో కళా రంగంలో ప్రతిభ చూపే కళాశాల విద్యార్థికి ఏటా నగదు పురస్కారం అందజేయనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బీఎస్ రెడ్డి ఇంద్రజాల విద్యలో అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం తమకు ఎంతో గర్వకారణమని భానోజీరావు తెలిపారు.

## ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా పోరాడుతున్న కార్మికులకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఉక్కు పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1107వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కును గురించి పోరాడుతున్నా, ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

## సింహగిరిపై తప్పిన ప్రమాదం



ఎగువకు ఎక్కలేక నిలిచిన మినీ వ్యాను

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం అన్నదానం సరుకుల లోడుతో వెళ్తున్న మినీ వ్యాను ఎగువకు ఎక్కలేక వెనక్కి వెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు.. సింహగిరిపై ఉన్న అన్నదాన భవనానికి సరుకులతో ఉదయం సుమారు 10 గంటల సమయంలో మినీ వ్యాను వస్తోంది. పీఆర్వో కార్యాలయం నుంచి కుడివైపు వెళ్లే తరుణంలో అప్ ఎక్కలేక వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న దేవస్థానం అంబులెన్స్‌తో పాటు వెనుక ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.